



సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 13-1-2025

సంపుటి: 20 సంచిక: 247
పేజీలు: 4 వెల: రూ.1


సంక్రాంతిని పురస్కరించుకొని మంగువారి తోటలో నివసిస్తున్న కళింగకోమటి నిరుపేదలకు అక్కడి కళింగకోమటి సంఘం ఆధ్వర్యంలో చీరలు, లుంగీలు, టవర్స్ కిట్‌లను సోమవారం భోగీనాడు పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్ పొందూరు రమణ, పెద్దిన మురళీ కృష్ణ, గోవింద్, షన్ముఖ తదితరులతో పాటు ఈ కార్యక్రమంలో కళింగకోమటి పెద్దలు, మంగువారితోట కళింగకోమట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం
























• ఎడిటోరియల్

# ట్రంప్ సామ్రాజ్య కాంక్ష

స్వేచ్ఛా ప్రపంచ రక్షణ కోసం పనామా కాలువను తిరిగి తమకు అప్పగించాలని, డెన్మార్క్‌లోని గ్రీన్‌లాండ్, కెనడాలు తమకు కావాలని, మెక్సికో గల్ఫ్ పేరును అమెరికాగా మారుస్తానని, తద్వారా ఆ ప్రాంతంపై తమ ఆధిపత్యం, ప్రపంచ నాయకత్వం మరింతగా ప్రతిబింబిస్తుందని డోనాల్డ్ ట్రంప్ చెప్పాడు. ఈ మాటలు సామ్రాజ్యవాద కాంక్ష వెల్లడి తప్ప మరొకటి కాదు. అమెరికాకు తగులుతున్న ఎదురుదెబ్బల పూర్వరంగంలో ప్రమాద ఘంటికలను గుర్తు చేసింది. స్వీయ రక్షణ సాకుతో ప్రపంచమంతటా 80 దేశాల్లో 800కు పైగా చిన్న, పెద్ద మిలిటరీ కేంద్రాలను ఏర్పాటుచేసిన అమెరికా ఆ ముసుగులో ఆధిపత్యం చెలాయించటానికి పూనుకున్న ఈ మాటలు ఆశ్చర్యం కలిగించటం లేదు. అయితే అది ఆచరణ సాధ్యమా అంటే కాదని వేరే చెప్పనవసరం లేదు. అయినప్పటికీ ట్రంప్ ఎందుకు ఇలా మాట్లాడుతున్నట్లు? రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికా పెద్దన్నగా ఉన్నప్పటికీ ఎక్కడా అది పైచేయి సాధించిన ఉదంతం లేదు. చిన్న దేశాలైన వియత్నాం నుంచి ఆఫ్ఘనిస్తాన్ వరకు ఆక్రమించి చివరకు పారిపోయి ప్రాణాలు దక్కించుకోవటాన్ని చూశాము. ఎదురుదెబ్బలు తగులుతున్న పరిణామంలో అనేక దేశాలు అమెరికాను ఖాతరు చేయటం లేదు. ఆ ఉక్రోషంతో మరోసారి అమెరికాకు అగ్రస్థానం తెస్తా అనే నినాదంతో రెండోసారి అధికారానికి వచ్చిన ట్రంప్ అమెరికన్లను ఆకట్టుకొనేందుకు చూస్తున్నాడు. కెనడా రక్షణకు తాము బిలియన్ల కొద్దీ డాలర్లను ఖర్చు చేస్తున్నామని, అక్కడి నుంచి వచ్చే దిగుమతులు తమను దెబ్బతీస్తున్నందున తమ దేశంలో ఒక రాష్ట్రంగా ఉండాలన్న ట్రంప్ ప్రతిపాదనను కెనడా ప్రధాని ట్రూడో తిరస్కరించాడు. అందుకు ఏమాత్రం అవకాశం లేదన్నాడు. డెన్మార్క్ కూడా అదే చెప్పింది, తమ భవిష్యత్‌ను గ్రీన్‌లాండర్స్ మాత్రమే నిర్ణయించుకుంటారన్నది. ఆర్కిటిక్ ప్రాంతంలో వ్యూహాత్మకంగా కీలకంగా ఉండటమే గాక కేవలం 57 వేల మంది జనాభా మాత్రమే ఉన్న ప్రపంచంలోని అతి పెద్ద దీవి గ్రీన్‌లాండ్‌పై అమెరికా కన్ను పడటానికి హైటెక్, విద్యుత్ బాటరీల తయారీకి అవసరమైన ముడిసరుకు అక్కడ పుష్కలంగా ఉండటమే కారణం. భవిష్యత్ విద్యుత్ వాహనాలదే అని తేలిపోయిన కారణంగానే ఆ ప్రాంతం మీద అమెరికా కార్పొరేట్ల కన్నుపడింది. ట్రంప్ ద్వారా తమ వాంఛను వెల్లడించాయి పైకి మాత్రం చైనా, రష్యా నౌకల రాకపోకలను తెలుసుకొనేందుకు అది తమకు మిలటరీ రీత్యా ఎంతో అవసరమని ట్రంప్ చెప్పాడు. గ్రీన్‌లాండ్ కోసం అవసరమైతే మిలిటరీ, ఆర్థిక బలాన్ని వినియోగిస్తామన్నాడు. అమెరికాలో విలీనం కావాలని గ్రీన్‌లాండర్స్ ఓటింగ్ నిర్వహించాలని కూడా చెప్పాడు. అక్కడ అమెరికాలోనే పెద్దదైన అంతరిక్ష కేంద్రం కూడా ఇప్పటికే ఉంది. ట్రంప్ ప్రకటనకు ముందు అతగాడి కుమారుడు ఒక ప్రైవేట్ జెట్‌లో వ్యక్తిగతం పేరుతో గ్రీన్‌లాండ్ పర్యటన జరిపాడు. పనామా కాలువ హంకాంగ్‌కు చెందిన సికె హచిసన్ కంపెనీ ఆధీనంలో ఉంది, రెండు వైపులా ఉన్న రేవులను నిర్వహిస్తున్నది. అమెరికా నౌకలకు ఎక్కువ మొత్తాలను వసూలు చేస్తున్నదని, అది చైనా కంపెనీ అని ట్రంప్ ఆరోపించాడు. దీన్ని పనామా అధ్యక్షుడు జోస్ రావుల్ ములినో ఖండిస్తూ చైనా జోక్యం ఏమాత్రం లేదని స్పష్టం చేశాడు. పసిఫిక్-అట్లాంటిక్ సముద్రాలను కలుపుతూ 1910 దశకంలో ఈ కాలువను అమెరికా నిర్మించింది. 2000 సంవత్సరం జనవరి ఒకటి నుంచి పనామా ఆధీనంలోకి వచ్చింది. దాన్ని తమ మిలిటరీ కోసం నిర్మించినందున తమకు తిరిగి కావాలని గతంలో కూడా ట్రంప్ అన్నాడు. తిరిగి తీసుకొనే సమయం వచ్చిందన్నాడు. తానేం మాట్లాడినా అమెరికన్లు గుడ్డిగా నమ్ముతారనే భ్రమలో ఉన్న కారణంగానే 2021లో అమెరికా అధికార కేంద్రం కాపిటోల్ భవనంపై జరిగిన దాడిలో హిజబుల్లా తీవ్రవాదులు పాల్గొన్నట్లు ఆరోపించాడు. వైట్‌హౌస్‌లో ఇంకా అడుగు పెట్టకముందే ఇలా మాట్లాడుతున్నాడంటే జనవరి 20 తర్వాత ఏమంటాడో తెలియదు. నియంత హిట్లర్ ప్రపంచానికి ఎలా ముప్పు తెచ్చాడో డోనాల్డ్ ట్రంప్ తీరుతెన్నులను చూస్తే అదేపని చేసేట్లు అనిపిస్తోంది. యావత్ భూమండలాన్ని చాపమాదిరి చుట్టి చంకలో పెట్టుకోవాలని చూసిన ఆ నాజీ చివరకు దిక్కులేని చావు చచ్చాడు. ఈ పిచ్చివాడిని ఏం చేయాలో కాలమే నిర్ణయిస్తుంది.

## గ్రామ సమస్యలు పరిష్కరించండి

(సత్యంన్యూస్, వజ్రపుకొత్తూరు)

మండలంలోని బాతుపురం–పెదవంక గ్రామ సమస్యలపై సోమవారం యూనిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలాస ఎమ్మెల్యే శిరీషకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో వీధి కాలువలు లేక ఇష్టానుసారంగా మురికి నీరురోడ్లపై విచ్చలవిడిగా ప్రవహిస్తుందన్నారు. కనీసం పారిశుద్ధ్య పనులు చేపట్టడంలేదని వాపోయారు. అనేకసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదన్నారు. తక్షణమే వీధుల్లో కాలువలు ఏర్పాటు చేసి సమస్య శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే శిరీష సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు అని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు పరపతి కిరణ్, శ్రీధర్, దుర్యోధన,మోహన్,శ్రీను,నవీన్,సుధా,పృధ్వి, సంతోష్, మౌళి, కృష్ణ, చందు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి భక్తుడికీ ఆదిత్యుని దర్శనం కల్పించాలి



- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఆదేశాలు
- రథసప్తమి ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్, అధికారులతో సమీక్ష
- రాష్ట్ర పండుగగా నిర్వహించనున్న నేపథ్యంలో దాదాపు 2 లక్షల మంది వచ్చే అవకాశం
- డోనర్ పాస్ కలిగిన వారికి ఈనెల 20 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 3 రోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనున్న వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆదేశించారు. ప్రతి సామాన్య భక్తుడికి సైతం ఆదిత్యుని దర్శనం లభించేలా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. ఫిబ్రవరి 4 నుంచి అరసవల్లిలో నిర్వహించనున్న రథసప్తమి వేడుకల ఏర్పాట్లపై రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్థక, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండుశంకర్‌తో కలిసి ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్‌దినకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమీక్షకు ఎస్పీ మహేశ్వరరెడ్డి, దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, ప్రధానఅర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్రపండుగగా గుర్తించి, 3 రోజులు వేడుకలు జరగనున్న నేపథ్యంలో ఉభయ తెలుగురాష్ట్రాలతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి దాదాపు 2 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని గుర్తు చేశారు. దీనికి అనుగుణంగా పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు.

### డోనర్‌లకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

సుదూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సైతం సులభతర దర్శనం లభించేలా ప్రత్యేకశ్రద్ధ వహించాలని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. గతంలో జరిగిన పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా పోలీసు బందోబస్తు, పారిశుధ్య నిర్వహణ, భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేయాలని కోరారు. దీనిపై స్పందించిన అధికారులు ఆయా శాఖలు, విభాగాల వారీగా రథసప్తమికి సమాయత్తమవుతున్నామని తెలిపారు. డోనర్ పాస్ ఉన్న వారికి ఈనెల 20వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించామని వెల్లడించారు. పాస్‌లు కలిగి ఉన్నవారంతా దీనిని గమనించి సహకరించాలని కోరారు. అలాగే ఏటా తరహాలో శ్రీకాకుళం నగరానికి చెందిన భక్తులు సాయంత్రం సమయంలో దర్శనాలకు వచ్చేలా అవగాహన కల్పిస్తామన్నామని వివరించారు. తద్వారా ఒకే సమయంలో వచ్చే రద్దీని నియంత్రించి, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు.

## నిస్వార్థ, నిరంతర శ్రామికులు పోలీసులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రజల కోసం పోరాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం పని చేస్తున్న నిస్వార్థ శ్రామికులు పోలీసులని రెండవ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక 80 అడుగుల కూడలి వద్ద గల వి.వన్ రెస్టారెంట్‌లో జరిగిన నేషనల్ యూత్‌డే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఎస్పీ కెవీ మహేశ్వరరెడ్డి సూచనల మేరకు, మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్నామని, ఈ రోజు జీఈవో, గ్లోబల్ ఎంపవర్మెంట్ ఆర్గనైజేషన్ సద్గుణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి తాను రావటం అదృష్టంగా భావిస్తున్నానని, ఇంతవరకు జీఈవో సేవలు కోసం వినలేదని, ఈ రోజు ప్రత్యక్షంగా చూస్తున్నానని, సుమారు 40మంది పేద విద్యార్థులను చదివించటం చాలా కష్టమని, వీరిలో ఐఐటి విద్యార్థులు కూడా వున్నారని తెలిసి ఆశ్చర్యపోయానన్నారు. రెండవ తరగతి నుండి, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు కూడా ఉండటం, అందరికి ఒక్కడై తన జీతాన్ని పేద విద్యార్థుల కోసం వెచ్చించటం గొప్పవిషయమన్నారు. తనకు కూడా ఇద్దరు పిల్లలు ఉన్నారని, వారి చదువుల కోసం ఎంత కష్టపడ్డానో తెలుసన్నారు. అలాంటిది ఇంత మంది విద్యార్థులను చదివిస్తున్నారంటే సద్గుణ కష్టం అర్థమవుతుందన్నారు. అసలు ఈ కార్యక్రమానికి డిఎస్పీ వివేకానంద హాజరు కావాల్సి ఉందని, కానీ ఇటువంటి కార్యక్రమాలకు హాజరు కావడం ద్వారా ఎంత అవగాహన పెంచుకోవచ్చో ఆయన చెప్పడం వెనుక ఇప్పుడు అర్థమవుతుందన్నారు. ఈ ఆర్గనైజేషన్ పిల్లలను చదివించడంతోపాటు నిత్యావసర సరుకులు పంపిణీ, రక్తదాన శిబిరాలు, అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ, పోలీస్ వ్యవస్థపై, వివేకానంద జీవిత విశేషాలను అందరికీ వివరించారు. అలాగే విశిష్ట అతిథిగా ప్రముఖ వైద్యురాలు డా.హారిక పాల్గొని ప్రసంగించిన అనంతరం విద్యార్థులకు బంగారు పతకాలను అందించారు. కార్యక్రమంలో జీఈవో గ్లోబల్ ఎంపవర్మెంట్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు సద్గుణ, సభ్యులు స్వరూప్, సంతోషిణి, సౌజన్య పట్నాయక్, ఉర్లం.శివతేజ, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లితండ్రులు, వి.వన్ రెస్టారెంట్ సభ్యుల బృందం పాల్గొన్నారు.






# డాకు మహారాజ్

# బాలయ్యమార్కు మాస్!

**కథ:** మదనపల్లిలో టీ ఎస్టేట్.. స్కూల్ నడిపే పెద్ద మనిషి మనవరాలైన జాహ్నవి ప్రమాదంలో ఉన్నట్లు మధ్య ప్రదేశ్ జైల్లో ఉన్న సీతారాం అలియాస్ డాకు మహారాజ్ (నందమూరి బాలకృష్ణ)కు తెలుస్తుంది. దీంతో పోలీసుల నుంచి తప్పించుకుని మదనపల్లికి వచ్చేసిన సీతారాం.. నానాజీ అని పేరు మార్చుకుని డ్రైవర్ పేరుతో ఆ పాపకు సంరక్షకుడిగా మారతాడు. లోకల్ ఎమ్మెల్యే నుంచి జాహ్నవికి ప్రాణహాని ఉందని తెలుసుకుని తనను కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఉంటాడు. ఈ గొడవ పెద్దదై పాప కుటుంబం మీద బల్వంత్ సింగ్ ఠాకూర్ (బాబీ డియోల్) అనే డాన్ కళ్లు పడతాయి. అప్పుడే బల్వంత్ కు.. డాకుకు మధ్య వైరం సంగతి బయటికి వస్తుంది. ఇంతకీ సీతారాం డాకు ఎందుకయ్యాడు.. అతడికి పాపకు సంబంధమేంటి.. బల్వంత్ తో అతడి గొడవేంటి.. చివరికి అతడితో పోరాటంలో డాకు గెలిచాడా లేదా అన్నది మిగతా కథ.

**నటీనటులు:** నందమూరి బాలకృష్ణ తన అభిమానులు.. మాస్ ప్రేక్షకులు ఎలా కోరుకుంటారో అలా కనిపించాడు 'డాకు మహారాజ్'లో. గడ్డంతో 'నిప్పురవ్వ' సినిమాను గుర్తు చేసేలా ఉన్న ఆయన ఫ్లాష్‌బ్యాక్ లుక్ బాగుంది. మిగతా లుక్స్‌లో మామూలుగా అనిపిస్తారు. ఎప్పట్లాగే ఆవేశం ప్రదర్శించాల్సిన సన్నివేశాల్లో బాలయ్య అదరగొట్టాడు. ఎమోషనల్ సీన్లలో కూడా బాగా చేశాడు. యాక్షన్ ఘట్టాల్లో ఓకే. మిగతా సన్నివేశాల్లో మామూలుగా సాగిపోయింది ఆయన నటన. బాలయ్య నుంచి పంచ్ డైలాగులైతే ఆశించిన స్థాయిలో లేవు. ప్రగ్యా జైశ్వాల్ కు కొంత మేర నటించే అవకాశం దక్కింది ఈ చిత్రంలో. ఆ అవకాశాన్ని ఆమె బాగానే ఉపయోగించుకుంది. శ్రద్ధా శ్రీనాథ్‌ను మరో హీరోయిన్ అనుకుంటాం కానీ.. ఆమె పాత్రలో ట్విస్ట్ ఉంది. అదేంటో తెరపైనే చూడాలి. ఆమె పెర్ఫామెన్స్ కూడా బాగుంది. బల్వంత్ సింగ్ పాత్రలో బాబీ డియోల్ స్క్రీన్ ప్రెజెన్స్ బాగున్నా.. క్యారెక్టర్లో కొత్తదనం లేకపోవడంతో ఆయన మార్కు చూపించడానికి అవకాశం లేకపోయింది. కథలో కీలకమైన పాత్రలో చిన్న పాప బాగా చేసింది. సహాయ పాత్రలలో సచిన్ ఖేద్కర్.. మకరంద్ దేశ్ పాండే.. రవి కాలే.. వీళ్లంతా బాగానే చేశారు. ఊర్వశి రౌటెలా గురించి పెద్దగా చెప్పుకోవడానికేమీ లేదు.

**కథనం-విశ్లేషణ:**

అనగనగా ఓ ప్రాంతం. అక్కడ అరాచకం రాజ్యమేలుతూ ఉంటుంది. ఓ పెద్ద విలన్.. అతడి గ్యాంగ్ అక్కడి జనాలను పీక్కు తింటూ ఉంటారు. అందరూ వారికి సలాం కొట్టాల్సిందే. ఎదురొచ్చిన వాళ్లందరినీ చంపి అవతల పడేస్తుంటుంది ఆ గ్యాంగ్. తమను కాపాడే దేవుడు ఎవరా అని అక్కడి జనం ఆశగా చూస్తున్న సమయంలో హీరో అక్కడికొస్తాడు. తన కళ్ల ముందు ఒక ఘోరం జరగడంతో అతడి ఉగ్ర రూపం బయటికి వస్తుంది. ఊచకోత మొదలవుతుంది. విలన్‌తో వార్ షురూ అవుతుంది. చివర్లో ఈ పోరులో హీరోనే గెలుస్తాడు. కమర్షియల్ తెలుగు సినిమాలో చాలా సాధారణంగా కనిపించే ఫార్మాట్ ఇది. ఇక నందమూరి బాలకృష్ణ అయితే ఈ లైన్లో ఎన్ని సినిమాలు చేసి ఉంటాడో లెక్కే లేదు. కొంచెం నేపథ్యాన్ని మార్చి ఆయన్ని ఇదే కథల్లో ప్రెజెంట్ చేయడానికి చూస్తుంటారు దర్శకులు. ఐతే బాలయ్య సినిమా అంటే కథ గురించి కూడా ఆయన అభిమానులు.. మాస్ ప్రేక్షకులు పెద్దగా పట్టించుకోరు. తాము కోరుకునే ఎలివేషన్లు..భారీ యాక్షన్ ఘట్టాలు..పంచ్ డైలాగులు ఉంటే చాలు.. "జై బాలయ్య" అనేస్తారు. కెరీర్ ఆరంభం నుంచి సగటు మాస్ మసాలా సినిమాలే తీస్తూ వచ్చిన బాబీకి బాలయ్య శైలిని.. అభిమానుల ఆకాంక్షలను బాగానే అర్థం చేసుకుని అంచనాలకు తగ్గ సినిమానే తీశాడు. ఇందులో కొత్త కథేమీ లేదు. పైన చెప్పుకున్న ఫార్మాట్లోనే ఒక సగటు మసాలా కథను అల్లేసింది బాబీ అండ్ టీం. అందులో ఎలివేషన్లు.. యాక్షన్ సీక్వెన్సులు.. మాస్ డైలాగులు.. మామూలే. బాలయ్య అభిమానులు.. మాస్ ప్రేక్షకులు కోరుకునే అంశాలకు ఢోకా లేని ఈ సినిమాలో కొత్తగా చెప్పుకోవడానికి ఏమీ లేదు.

బాబీ నుంచి కొత్త కథలు ఆశించలేమని మొదట్నుంచి అతను తీస్తున్న సినిమాలను చూస్తేనే అర్థమైపోతుంది. ఈసారి కూడా అతనేమీ భిన్నంగా ప్రయత్నించలేదు. కాకపోతే మామూలుగా మాస్ డైరెక్టర్ల టేకింగ్.. విజువల్స్ అన్నీ కూడా ఒక రొడ్డ కొట్టుడు స్టైల్లో సాగిపోతాయి. 'డాకు మహారాజ్'లో మాత్రం మాస్ కథకు స్టైలిష్ టేకింగ్ తోడయ్యేలా చూసుకున్నాడు బాబీ. 'డాకు మహారాజ్' ప్రోమోలు చూస్తేనే అందులో విజువల్స్ డిఫరెంటుగా అనిపిస్తాయి. రొటీన్ యాక్షన్ ఘట్టాలనే స్టైలిష్ గా.. ఆకర్షణీయంగా ప్రెజెంట్ చేశాడు. సినిమాటోగ్రఫీ వల్ల సినిమాకు ఒక కొత్త కలర్ వచ్చింది. శ్రద్ధ శ్రీనాథ్.. ప్రగ్యా జైశ్వాల్ చేసిన హీరోయిన్ల పాత్రలను సగటు కమర్షియల్ సినిమాల స్టయిల్లో ప్రెజెంట్ చేయకపోవడం.. ఆ పాత్రలకు పాటలు- రొటీన్ డైలాగులు పెట్టి గ్లామర్ గర్ల్స్ గా చూపించకపోవడం ఇందులో కనిపించే మరో విశేషం. మాస్ హీరోల సినిమాలంటే అభిమానులు ప్రధానంగా ఆశించేది ఎలివేషన్ సీన్లు. 'డాకు మహారాజ్'లో వాటికి ఢోకా లేదు. ముందుగా ఐదారు ఎలివేషన్ సీన్లు రాసుకుని.. వాటి చుట్టూ సగటు కథను అల్లినట్లు అనిపిస్తుంది 'డాకు మహారాజ్' చూస్తుంటే. ముఖ్యంగా విలన్ చేసిన అరాచకాన్ని చూసి రగిలిపోయిన హీరో.. తన ఇంటికే వెళ్లి విధ్వంసం సృష్టించే ఎపిసోడ్ 'డాకు..'లో హైలైట్‌గా నిలుస్తుంది. ఇసుక తుఫాను నేపథ్యంలో వచ్చే మరో ఎపిసోడ్ సైతం బాలయ్య అభిమానులకు గూస్‌బంప్స్ ఇస్తుంది. బాలయ్య ఇలాంటి సీన్లు చేయడం కొత్త కాదు. కానీ ఎన్నిసార్లు చూసినా సరే సన్నివేశంలో తగిన ఎమోషన్ ఉంటే.. ఇలాంటివి మళ్లీ మళ్లీ వర్కవుట్ అవుతాయి. 'డాకు..'లో కూడా అదే జరిగింది. 'డాకు మహారాజ్' ఆరంభంలో కొంచెం నెమ్మదిగా అనిపించినా.. తర్వాత వేగం పుంజుకుంటుంది. హీరో–పాప మధ్య ఎమోషన్ నేపథ్యంలో కథను ముందుకు నడిపించాడు దర్శకుడు. మరీ రొటీన్ అనిపించినా సరే.. ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడే సినిమాకు ఆయువుపట్టుగా మారింది. సీతారం పాత్ర డాకుగా మారే క్రమంలో వచ్చే సీన్లు బాగా పేలాయి. యానిమల్ ఫేమ్ బాబీ డియోల్ చేశాడంటే విలన్ పాత్రలో ఏదైనా విశేషం ఉంటుందేమో అని చూస్తాం. కానీ అది సగటు ప్రతినాయకుడి పాత్రలాగే సాగుతుంది. ప్రగ్యా, శ్రద్ధ ఇద్దరూ పెర్ఫామెన్స్ ఓరియెంటెడ్ పాత్రలే చేయడం మంచి విషయమే అయినా.. వాళ్ల నుంచి గ్లామర్ ట్రీట్ ఆశించిన వాళ్లకు నిరాశ తప్పదు. దబిడి దిబిడి పాట వల్ల పెద్దగా ప్రయోజనం లేకపోయింది. ఓవరాల్ గా చెప్పాలంటే.. బాలయ్య నుంచి ఒక మాస్ సినిమాలో ఏం కోరుకుంటారో అవి ఈ చిత్రంలో ఉన్నాయి. ఎలివేషన్ సీన్లు.. భారీ యాక్షన్ ఘట్టాలను ఇష్టపడేవారికి 'డాకు మహారాజ్' సంతృప్తినిస్తుంది. కొత్తదనం కోరుకుంటే మాత్రం కష్టమే.

– తుపాకి.కామ్ సౌజన్యంతో..

**సాంకేతిక వర్గం:** బాలయ్య అనగానే పూనకాలు తెచ్చేసుకునే తమన్.. మరోసారి తన నేపథ్య సంగీతంతో ప్రేక్షకుల్లో ఉత్సాహం నింపాడు. ఎలివేషన్ సీన్లు.. యాక్షన్ ఘట్టాల్లో ఆర్ఆర్ మంచి ఊపుతో సాగింది. కానీ కొన్నిచోట్ల స్కోర్ మరీ లౌడ్ అనిపిస్తుంది. వాయిద్యాల హోరు మరీ ఎక్కువ అయిపోయింది. తన పాటలు సోసోగా అనిపిస్తాయి. విజయ్ కార్తీక్ ఛాయాగ్రహణం సినిమాలో మేజర్ హైలైట్. సగటు మాస్ సినిమాలకు భిన్నమైన కలర్ గ్రేడింగ్ తో అతను సినిమాకు డిఫరెంట్ లుక్ తీసుకొచ్చాడు. విజువల్స్ ఆద్యంతం ఆకట్టుకుంటాయి. యాక్షన్ సీక్వెన్సుల్లో సినిమాటోగ్రఫీ చాలా బాగుంది. నిర్మాణ విలువలు చాలా బాగున్నాయి. చాలా రిచ్ గా తీశారు సినిమాను. భాను-నందు మాటలు కొన్ని చోట్ల పేలాయి. బాబీ ఎంచుకున్న కథ రొటీన్. దానికి అతను.. చక్రవర్తి కలిసి చేసుకున్న స్క్రీన్ ప్లే పర్వాలేదనిపిస్తుంది. బాబీ కథ కంటే టేకింగ్ మీద దృష్టిపెట్టాడు. సినిమాలో కీలకమైన ఎపిసోడ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాడు. హీరో ఎలివేషన్లకు ఢోకా లేకుండా చూసుకున్నాడు. అతను ప్రధానంగా బాలయ్య అభిమానులను దృష్టిలో ఉంచుకునే సినిమా తీసినట్లు అనిపిస్తుంది. వారినైతే సంతృప్తి పరిచాడు కానీ.. కొత్తగా ఏమీ చేయలేకపోయాడు.

### జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

(సత్యంన్యూస్, నరసన్నపేట)



తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి పండుగ నిలుస్తుందని వైసీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణ దాస్ అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ సంక్రాంతి పండుగ ప్రజలందరి జీవితాలలో కొత్త కాంతులు నింపాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు, రాష్ట్రంలో తన అభిమానులకు సంక్రాంతి శుభాలు ఇవ్వాలని ఆకాంక్షించారు.



సంక్రాంతి సందర్భంగా శ్రీకాకుళం నగరంతోపాటు పాలకొండ మండలం అర్దలి, వెంకంపేట గ్రామాల్లో నిరుపేద కుటుంబాలకు నాగవంశ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను ప్రముఖ రచయిత నల్లి ధర్మారావు అందించారు. కార్యక్రమంలో బోను రాజేశ్వరరావు, బోను సూర్య ప్రభాకరరావు, న్యాయవాది నల్లి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. - సత్యంన్యూస్, శ్రీకాకుళం.

## సంక్రాంతి వేళ బిజీబిజీగా మంత్రి

(సత్యంన్యూస్, టెక్కలి)

సంక్రాంతి వేళ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిమ్మాడలో గ్రామస్థులతో ముచ్చటించారు. సొంతూళ్లో సంక్రాంతి వేడుకలను జరుపుకుంటున్నారు. భోగి పండగ వేళ కింజరాపు కుటుంబం అంతా ఒకే చోట చేరి ఆనందాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ సిరి సంపదలతో రాష్ట్రం తులతూగాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. అనంతరం తనను కలిసిన గ్రామస్థులతో ముచ్చటించి, వారి సమస్యలను సావధానంగా విని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పండుగ వేళ సకల శుభాలూ కలగాలని, కూటమి ప్రభుత్వం వ్యవసాయదారులకు అండగా ఉండేందుకు నిరంతరం పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో రైతుల అభ్యున్నతికి తమ కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాగ ద్వేషాలకు అతీతంగా గ్రామాలలో ఈ పెద్ద పండుగ చేసుకోవాలని, పల్లెల వృద్దే దేశాభివృద్ధి అని అన్నారు. ఆయన వెంట కింజరాపు హరి వర ప్రసాద్, గ్రామస్థులు ఉన్నారు.





కుటుంబసభ్యులతో కలిసి భోగి వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఈమేరకు శ్రీకాకుళంలో గల తన నివాసంలో భోగి వేడుకలు జరుపుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా భోగి పండుగ ప్రారంభమవుతోందన్నారు. పాత విషయాలను వదిలించుకుని కొత్త ప్రారంభాలను జరుపుకోవాలని సూచించారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం.

## జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



జిల్లా ప్రజలకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భోగి భోగభాగ్యాలను, సంక్రాంతి సుఖసంతోషాలను, కనుమ కమ్మని అనుభవాలను అందించాలని ఆకాంక్షిం చారు. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిక సంక్రాంతి పండు గను ప్రతి ఒక్కరు కుటుంబ సభ్యులతో ఇంటిల్లిపాది ఆనందంగా పండుగను జరుపుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు.

# పాడి పరిశ్రమ అభివృద్ధే లక్ష్యంగా గోకులాల నిర్మాణం



(సత్యంన్యూస్, గార)

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాడిరైతుల సంక్షేమాభివృద్ధి కోసం చర్యలు చేపట్టిందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండలం శ్రీకూర్మం పంచాయతీ అయ్యవారిపేట గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన మిని గోకులం షెడ్‌ను ఎమ్మెల్యే శంకర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మినీ గోకులం షెడ్ల మంజూరుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. గత ప్రభుత్వ పరిపాలనలో గోకులం షెడ్లను పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మరలా అధికారంలోకి రావడంతో వాటికి పూర్వ వైభవం తెచ్చేందుకు అడుగులు వేస్తోందన్నారు. గ్రామాల్లో పశుపోషణ, కోళ్లు, గొర్రెలు, మేకలు పెంపకానికి మెరుగైన వసతి కల్పిస్తూ, పెంపకందార్లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పశువుల నివాసానికి కొద్దిపాటి స్థలం ఉంటే మినీగోకులం పేరిట షెడ్లు నిర్మించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. పాడి రైతులు అందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. 90 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందించే ఈ పథకాన్ని ఆర్హులైన ప్రతి ఒక్క పాడి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువుల షెడ్ల నిర్మాణానికి రైతులు సహకరించి తద్వారా పశువుల పెంపకం అభివృద్ధితో దేశాభివృద్ధికి తోడ్పడాలన్నారు. పశు సంవర్ధక శాఖ, జాతీయ లైఫ్ స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో ఔత్సాహిక రైతులకు, పశువుల పెంపకందారులకు నిరుద్యోగులకు ప్రోత్సాహంగా ప్రభుత్వము అనేక రుణాలు అందజేస్తుందన్నారు. వీటిని ప్రతీఒక్క పశువుల పెంపకం రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సన్న, చిన్నకారు రైతులు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇచ్చే ఆర్థిక రుణాలను అంది పుచ్చుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడి రుణాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు, మండల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు ఇతర ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యుత్ స్మార్ట్‌మీటర్స్ పేరుతో ప్రజలపై భారాలకు వ్యతిరేకంగా అందరూ ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు డిమాండ్ చేశారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శ్రీకాకుళం ఇందిరానగర్ కాలనీలో భోగిమంటల్లో విద్యుత్ బిల్లులు దగ్ధం చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్ళుగా మారనున్న విద్యుత్ స్మార్ట్‌మీటర్లు బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో, జిల్లాలలో ప్రభుత్వ కార్యాలయాలకు ముందుగా ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్లు బిగించారని, ప్రస్తుతం చిన్న, మధ్య తరగతి వ్యాపారసంస్థలతోసహా అందరికీ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారన్నారు. నివాస గృహాలకు మీటర్లు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగిస్తున్నారని, ఇది ఎంతవరకు సమంజసమన్నారు. వైకాపా హయాంలో పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని ప్రతిపక్షంలో ఉండగా తెలుగుదేశం, జనసేన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఆ నేతలు మీటర్లు పగలగొట్టాలని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. అదానీ, షిర్డీసాయి సంస్థలతో కుమ్మక్కయ్యి, వేలాది కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడి ఒప్పందాలు చేసుకొని మీటర్లు పెడుతున్నారని నాడు ఆరోపించారన్నారు. నేడు టీడీపీ కూటమి ప్రభుత్వం మాట తప్పి మీటర్ల ఒప్పందాలను కొనసాగిస్తూ ప్రతి కనెక్షన్‌కు స్మార్ట్‌మీటర్ పెట్టడం నమ్మకద్రోహమేనన్నారు. ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్ల వల్ల ప్రజలందరిపై భారం పెరుగుతుందన్నారు. ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జ్ చేయించుకోవాలని, బ్యాలెన్స్ పూర్తి కాగానే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, దీంతో పేదలకు అంధకారమే మిగులుతుందన్నారు. మరోవైపు ప్రతి మీటర్‌కు అయ్యే వ్యయం 96 నెలలపాటు వాయిదాల పద్ధతిలో వేలాది రూపాయలు వినియోగదారుల నుండే వసూలు చేస్తారన్నారు. మరోవైపు విద్యుత్ అధికంగా వినియోగించే రాత్రి వేళల్లో అధికరేట్లు వసూలు చేయటం నడ్డి విరిచే భారమవుతుందన్నారు. వ్యవసాయ ఉచిత విద్యుత్తుకు ఎసరపెట్టేందుకే పంపుసెట్లకు మీటర్లు బిగిస్తున్నారన్నారు. ఏ భారం ఉండదని పైకి చెప్తున్నా ప్రయివేటు విద్యుత్ ఉత్పత్తిదారులకు దోచిపెడుతూ, ప్రజలపై భారాలు వేసేందుకు, ఉచిత విద్యుత్‌ను దశలవారీగా తొలగించడానికి ఈ స్మార్ట్ మీటర్ల విధానాన్ని తీసుకువచ్చారని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి నాడు వైకాపా, నేడు తెలుగుదేశం, జనసేన పార్టీలు ఈ మీటర్లను కొనసాగించడం దారుణమన్నారు. ఇప్పటికే రూ.17వేల కోట్లు ట్రూఅప్ చార్జీల భారం వేస్తున్నారన్నారు. మరోవైపు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలను వంచించటం తగదన్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.ప్రకాష్, ఎల్.మహేష్, శ్రీను, చిన్నారావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ ఎం.గోవర్ధనరావు, శంకర్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## బలవంతపు భూసేకరణ ఆపాలి



(సత్యంన్యూస్, పలాస)

వజ్రపుకొత్తూరు మండలం వంకులూరు గ్రామంలో సోమవారం వామపక్షాలు, ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో భోగిమంటల్లో పత్రుల్ని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్, లిబరేషన్ నాయకులు సన్యాసిరావు మాట్లాడుతూ తరతరాలుగా జీవనం సాగిస్తున్న ప్రజల ఆస్తులను బలవంతంగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి ప్రజలను నిరాశ్రయులను చేయడం అభివృద్ధి ఎలా అవుతుందని కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ప్రశ్నించారు. ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీల పక్షమా లేదా ప్రజల పక్షం ప్రజలకు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అభివృద్ధి ముసుగులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముద్రతీర ప్రాంతాన్ని కార్పొరేట్ల కంపెనీలకు కట్టబెట్టడానికి పూనుకుంటున్నాయని వారు విమర్శించారు. ప్రజల ఆస్తులను కార్పొరేట్ కంపెనీ ఆస్తులుగా మార్చితే సహించేది లేదని వారు హెచ్చరించారు. మూలపేట కోర్టుకు కేటాయించిన 2,279 ఎకరాల్లో కార్గో ఎయిర్‌పోర్ట్‌కు 300ఎకరాలు కేటాయిస్తే ఎటువంటి భూసేకరణ అవసరం లేదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సిహెచ్ రవి, పోరాట సమితి కార్యదర్శి జోగి అప్పారావు, చెడు పెల్లి వల్లభరావు, లండ ఈశ్వరరావు, గుంట రమణయ్య, శ్రీదేవి, సుశీల, సావిత్రి, వరలక్ష్మి, లాలాక్షీ, కుమారిలు పాల్గొన్నారు

## డాక్టర్ శ్రీధర్ సేవలు అసామాన్యం

(సత్యంన్యూస్, కవిటి)

ప్రముఖ సామాజిక సేవకులు, వైద్యనిపుణులు, జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ తన స్వగ్రామంలో సంక్రాంతిని పురస్కరించుకొని అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా రాజపురం, గోపాలపురం గ్రామాల్లో మహిళలకు 2,500 చీరెలను శనివారం పంపిణీ చేశారు. ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా సంక్రాంతి పర్వదినాల్లో చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ చేయడం ఆనవాయితీగా వస్తోందని, దీనిలో భాగంగానే ఈ ఏడాది దుస్తులను అందజేశామన్నారు. డాక్టర్ దానేటి శ్రీధర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తన తల్లిదండ్రులు జగదీశ్వరమ్మ, బాబూరావుల పేర్లు మీదుగా వీటిని పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతీ ఏడాది ఇలా గ్రామస్తులతో కలసి సంక్రాంతి జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉంటుందన్నారు. నిరంతరం వృత్తి పరంగా ఎంతో బిజీగా ఉన్నా, సమాజసేవా కార్యక్రమాలు ముమ్మరంగా చేస్తున్నా తన సొంతూరుకు చేసే సేవలోనే ఎంతో తృప్తిగా ఉంటుందని స్పష్టం చేశారు. యువత అన్నిరంగాల్లో రాణించాలని వచ్చిన ప్రతీ అవకాశాన్ని వినియోగించుకుని ఉన్నతంగా ఎదగాలని డాక్టర్ శ్రీధర్ ఆకాంక్షించారు. ప్రతీ ఏడాది తమను గుర్తు పెట్టుకొని వచ్చి సంక్రాంతిని సంతోషంగా నిర్వహించుకునేందుకు దుస్తులను అందజేసే డాక్టర్ దానేటి శ్రీధర్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాజపురం సర్పంచ్ జానకిరామ్, ఎంపీటీసీ కృష్ణారావు, సంతు, గ్రామస్తులు, గ్రామపెద్దలు, పలువురు పాల్గొన్నారు.



# డ్రోన్ నిఘాలో శ్రీకాకుళం నగరం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సంక్రాంతి పండుగ నేపథ్యంలో పేకాట, కోడిపందాలు డొక్కాట వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. దీనిలో భాగంగా పేకాట, కోడిపందేలు జరిగేందుకు ఆస్కారం ఉన్న నిశితమైన ప్రదేశాలను ముందుగా గుర్తించి, గంజాయి వినియోగం, ఇతరత్రా చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పెట్టేందుకు ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ వినియోగిస్తున్నామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదివారం ఓ ప్రకటన జారీ చేశారు. నగరంలో 2వ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బైరివానిపేట, సీపన్నాయుడుపేట, కిమ్స్ హాస్పిటల్ వెనుక, పాజల్‌బేగ్‌పేట, దత్తాత్రేయ ఆలయం వెనుక భాగాన ఉన్న స్మశానవాటిక ప్రాంతం, నాగావళి నది పరీవాహక ప్రాంతమైన శాంతినగర్ కాలనీ, నాగావళి రివర్ వ్యూ పార్కు, రిమ్స్ హాస్పిటల్ వెనుక భాగము, బలగ, అయ్యప్ప స్వామి గుడి పరిధిలో నిర్మానుష్యమైన ప్రదేశాల్లో డ్రోన్స్ కెమెరాలతో నిఘా ఉంచి, గంజాయి వినియోగం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాల నిర్వహణ, ఇతర నేరాలు జరగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో నేరాలను నియంత్రించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న శివారు ప్రాంతాలను, నిశిత ప్రాంతాలను, తోటలు, బహిరంగ ప్రదేశాలను, పార్కులు, నదీ తీరాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ పంపి, నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, నేరాలకు పాల్పడి పట్టుబడినట్లైతే చట్టపరమైన కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే, ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001


















# రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని పెద్దపాడు రోడ్డు పవన్ కార్‌వరల్డ్ ఎదురుగా సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదం లో గార మండలం కొమరవానిపేటకు చెందిన యువకుడు అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు రామలక్ష్మణ జంక్షన్ నుంచి పెద్దపాడు వైపు ద్విచక్ర వాహనంతో వెళ్తున్న యువకుడు ఎదురుగా పెద్దపాడు నుంచి రామలక్ష్మణ వైపు వస్తున్న మహీంద్రా థార్ వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. యువకుడి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనం ఈ ప్రమాదంలో రెండు ముక్కలుగా విడిపోయింది. ద్విచక్ర వాహనంలో మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. ఈ ప్రమాదంలో థార్ వాహనం ముందు భాగంలోని చక్రం పేలిపోయింది. వాహనం ముందుభాగం దెబ్బతింది. సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదుచేశారు.















# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఆమదాలవలస గవర్నమెంట్ హైస్కూల్ 1983-84 బ్యాచ్ ఎస్ఎస్‌సీ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం ఆమదాలవలసలో జరిగింది. 1984లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ కలయిక పేరుతో కలిశారు. అప్పటి ఉపాధ్యాయులైన గురుగుబిల్లి గోవింద రావు, సత్యనారాయణ, బంగార్రాజు, వరదా నందంలను ఘనంగా సన్మానించారు. సత్కార గ్రహీతలు మాట్లాడుతూ తమ విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్నందుకు గర్వంగా ఉందని ప్రశంసించారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు జలుమూరు రవిబాబు, రమేష్, సురేష్, గోపి, రామ్మూర్తి, అప్పలకొండ, రమణమూర్తి ఆధ్వర్యంలో స్నేహితులందరూ పాత స్మృతులను గుర్తుతెచ్చుకుంటూ ఆనంద డోలికల్లో మునిగితేలారు. హాజరైన మిత్రులంతా తమ వంతుగా సమాజానికి సేవ చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. కష్టాల్లో ఉన్న తోటి స్నేహితుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు అందరూ తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 80 మంది మిత్రులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.